క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలోని పదహారు సచివాలయాల పరిధిలో వైఎస్సార్ పింఛను కానుక – సామాజిక భద్రతా పింఛన్లు శుక్రవారం ఉదయం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 సచివాలయాల పరిధిలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛను దారులు 745 మందికి రూ.2,89,38,500లు 5వ తేదీ వరకు వలంటీర్ల సాయంతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆయా పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ద్వారా వలంటీర్లకు పెన్షన్ నగదు అందించినట్లు చెప్పారు.

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ట వేడుకలు



శావల్యాపురం: కారుమంచి గ్రామంలోని సీతారామ స్వామి ఆలయం పునఃప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్మించిన దేవాలయ ప్రతిష్టా వేడుకలు బాలకృష్ణామాచార్యుల సారథ్యంలో అర్చకులు కొడవటికంటి కృష్ణమాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆదిత్య కుమార్ నిర్వహించారు. దాదాపు ఎనిమిది వేల మందికి అన్న సంతర్పణ చేశారు. సీతారామ స్వాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి తనయుడు గిరిబాబు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ బొల్లా వెంకట సాంబశివరావు, వివిధ గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ




నాదెండ్ల: చిలకలూరిపేట ఏఎంజీ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో గణపవరం విద్యార్థిని షేక్ ఆఫ్రీన్ సత్తా చాటింది. ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూలు ఐదో తరగతి చదువుతున్న ఆఫ్రీన్ జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. ఏఎంజీ యాజమాన్యం సర్టిఫికెట్‌తో పాటూ జ్ఞాపికను ప్రదానం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ గాజుల భాను శివసుందరం, ఉపాధ్యాయులు అభినందించారు.

టైపిస్ట్ లక్ష్మీసౌజన్యకు సన్మానం



నాదెండ్ల: ఎంపీడీఓ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న లక్ష్మీ సౌజన్యకు ఉద్యోగోన్నతి లభించింది. నరసరావుపేట పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించనున్నారు. ఈ మేరకు గురువారం ఆమెను ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు సన్మానించారు. ఎంపీడీఓ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ, సౌజన్యకు ఉద్యోగోన్నతి లభించటం అభినందనీయమన్నారు. మరిన్ని ఉన్నతులు పొందాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, నాదెండ్ల సొసైటీ మాజీ అధ్యక్షుడు సింగారెడ్డి కోటిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



బొల్లాపల్లి : గుమ్మనంపాడు గ్రామంలో జీపీఎల్ ప్రీమియర్ లీగ్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువనేత బొల్లా గిరిబాబు పాల్గొని, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

జగన్‌ను మళ్లీ సీఎంని చేసుకునేందుకు ప్రజలు సిద్ధం

- ఎన్నికల శంఖారావం పూరించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- నవోదయ నగర్‌లో ఇంటింటికి ప్రచారం



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా ఏర్పడిన టీడీపీ–జనసేనది అపవిత్ర కలయిక అని, మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపడతారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రెడ్డి నగర్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. 23వ వార్డు నవోదయ నగర్‌లో నియోజకవర్గ పరిశీలకుడు గులాబ్ రసూల్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వార్డు నాయకుడు పూనూరి కోటిరెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బాణ సంచా కాలుస్తూ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి.. ప్రజలకు అందిన సంక్షేమం, చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. వలంటీరు వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. 24 సీట్లకే జనసేన అమ్ముడుపోయిందని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారన్నారు. దీనిని కప్పిపుచ్చుకునేందుకు తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సభలో సీఎం జగన్‌పై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. చంద్రబాబు గెలుపు కోసం ప్యాకేజ్ తీసుకొని జనసేనను తాకట్టు పెట్టారని మండిపడ్డారు. ప్రజలు ఈ అపవిత్ర కలయికను గుర్తించి చీదరించుకుంటున్నారన్నారు. పవన్ కల్యాణ్‌కు ఇదే ఆఖరి ఎన్నికలని గుర్తుంచుకోవాలన్నారు. స్థానిక టీడీపీ నాయకుడు చదలవాడ అరవిందబాబు సీటు లభిస్తుందో లేదో చూసుకోవాలన్నారు. మరోసారి నియోజకవర్గంలో తాను గెలిచి మరో ఐదేళ్లు అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.సుజాతాపాల్, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, మాజీ కౌన్సిలర్ శివరాత్రి అంకమ్మరావు, బత్తుల లక్ష్మీ పద్మలత, పాలిమేర వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, హాలీవుడ్ రఘు, సీహెచ్ అనురాధరెడ్డి, సయ్యద్ ఫాతిమా, సయ్యద్ పెద్దఖాజా, సయ్యద్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

కర్తవ్యాన్ని బాధ్యతగా నెరవేర్చాలి

నరసరావుపేట: ఆర్యవైశ్యులు సమాజ సేవకులని, వారి కర్తవ్యాన్ని బాధ్యతగా నెరవేర్చాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘానికి నూతన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారిగా ఎన్నికైన చిన్ని శ్రీనివాసరావు, గంగా మోహన్, బత్తుల విష్ణు, మిగతా కార్యవర్గ సభ్యులు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 17న పట్టణంలోని జమిందారు ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న ప్రమాణస్వీకారానికి హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ ముగ్గురూ కలిసి ఆర్యవైశ్య సంఘాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. నూతన కార్యవర్గ సభ్యులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొత్తూరి సురేష్‌బాబు, మాజేటి సాంబశివరావు, వి.సాంబశివరావు, నిడమానూరి సురేంద్ర, దివ్వెల రామకృష్ణ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి లోక్‌సభ సమన్వయకర్త అనీల్ కుమార్‌యాదవ్



విశ్రాంత హెచ్‌ఎం షేక్ ఖాజావలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి స్థానిక షాదీఖానాలో ముస్లిం మైనార్టీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో పలు శాఖల్లో పనిచేస్తున్న ముస్లిం ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులు, పదోన్నతి పొందిన ఉద్యోగులను దుశ్శాలువా కప్పి, షీల్డు అందజేసి ఘనంగా సన్మానించారు. గతంలో దివంగత వైఎస్సార్, ఇప్పుడు సీఎం జగన్ ప్రభుత్వాల్లో ఇప్పటి వరకు పార్టీ ద్వారా లభించిన పదవులు, ప్రభుత్వం ద్వారా వారికి లభిస్తున్న సంక్షేమం గురించి వివరించారు. జరగబోతున్న ఎన్నికల్లో ముస్లింలకు ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేసేందుకు అత్యధిక నియోజకవర్గాలు కేటాయించటం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ముస్లిం సోదరులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషా భేగం ఖాజావలి, రొంపిచర్ల హెచ్‌ఎం బీఎం సుభాని, డీఈవో షేక్ హుస్సేన్, ఏపీఎస్ ఆర్టీసీ ముస్లిం ఉద్యోగులు ఆసిఫ్, సచివాలయం, మున్సిపాలిటీ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ ఉద్యోగులు హాజరయ్యారు.

ఉపాధి హామీ పనులు పరిశీలించిన డ్వామా పీడీ

వినుకొండ(నూజెండ్ల): వితంరాజుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ గంగవరపు జోసెఫ్ గురువారం పరిశీలించారు. సందర్భంగా ఆయన ఉపాధి హామీ కూలీల మస్టర్స్‌ను పరిశీలించి, మాట్లాడుతూ.. నీటి నిల్వ పనులు చేపట్టాలని, రైతువారీగా ఫారం పాండ్‌లు చేయాలని ఆదేశించారు. కొలతల ప్రకారం రూ.272లు వచ్చేవిధంగా కనీసం 4గంటలు పనులు చేసుకోవాలని తెలిపారు. ఎక్కువ జాబ్ కార్డ్స్ కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు పనుల్లోకి వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం 100 రోజులు దగ్గర ఉన్న కుటుంబానికి పనులు కల్పించి నూరు శాతం పనులు పూర్తి చేయాలన్నారు. ఏపీవో కట్టా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): ఏనుగుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు బాల్య వివాహాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, నాగరాజు కుమారి, శేషకుమారి మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, చట్టాలు తదితర అంశాలను వివరించారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎలీషా, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. నూజెండ్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీపీ మేడం జయరామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో వీరభద్రాచారి, సూపర్‌వైజర్లు విన్యాసమ్మ, నాగరాజుకుమారి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అంతరాలు తొలగేలా అద్భుత పాలన

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు



లబ్ధిదారులకు కరపత్రం అందజేస్తున్న సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు

చిలకలూరిపేట: ధనిక, పేద అంతరాలు తొలగిపోయేలా విప్లవాత్మక పథకాలతో అద్భుతమైన పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. పట్టణంలోని ఆరో వార్డు పరిధిలో ఉన్న ఎన్టీఆర్ కాలనీలో మన జగన్ – మన భవిత, మన ఊరు– మన రాజేష్ కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ముందుగా కాలనీలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఏ ఇంటికీ ఎంత లబ్ధి చేకూరిందో, వార్డులో జరిగిన అభివృద్ధిని వివరించారు. రాజేష్‌నాయుడుకి స్థానికులు అపూర్వ స్వాగతం పలికారు. ఇంటింటికీ అభివృద్ధి, సంక్షేమ వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్‌నాయుడు మాట్లాడుతూ ఒక్క 6వ వార్డు పరిధిలోనే 8,505 మంది లబ్ధిదారులకు రూ.27.69 కోట్ల సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. మళ్లీ జగనన్న అధికారంలోకి వస్తేనే ప్రజలకు పారదర్శక పాలన అందుతుందని, సంక్షేమ పరిపాలన కొనసాగుతుందన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికి మాత్రమే పథకాలు అందాయన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గతంలో పెత్తందార్ల మనుషులకు మాత్రమే నామినేటెడ్ పదవులు లభించేవని, నేడు 50 శాతం పదవులు బడుగు బలహీనవర్గాలకు దక్కేలా ఏకంగా చట్టం చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్, లక్ష్మీ నరసింహకాలనీల్లోని సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి ఒక ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తామని రాజేష్ నాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సేవలు అభినందనీయం

శావల్యాపురం: నేటి విజ్ఞాన ఫలాలు నాటి శాస్త్రవేత్తల కృషి ఫలితమేనని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టరు విమలాకుమారి పేర్కొన్నారు. స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా రెండు రోజులు నిర్వహించిన సైన్సు వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. విద్యార్థులకు ప్రశంస పత్రాలు, మొమెంటోలు అందజేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బెజవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు చిట్టేటి రవి, కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చందు, ప్రిన్సిపల్ రత్నకుమారి, డైరెక్టరు అజిత్ చందు పాల్గొన్నారు.

గణపవరం పంచాయతీలో విచారణ

నాదెండ్ల: గణపవరం గ్రామ పంచాయతీలో పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయ డీఎల్‌డీఓ శ్యామలాదేవి బృందం సభ్యులు గురువారం విచారణ చేపట్టారు. గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం నంది వెలుగుకు చెందిన బొప్పన సురేంద్ర 2019–22 వరకు పంచాయతీ కార్యాలయంలో వివిధ పనుల్లో అవకతవకలు జరిగాయని అప్పటి ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి ఎం.మోషే, పంచాయతీ సెక్రటరీ సాంబశివరావుపై ఫిర్యాదు చేశారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు శ్యామలాదేవి బృందం విచారణ చేపట్టింది. ప్రస్తుతం విచారణ జరుగుతోందని, పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సమయం పడుతుందని ఆమె తెలిపారు. ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు ఉన్నారు.

రహదారులపై చెత్త లేకుండా చర్యలు

శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించిన మున్సిపల్ కమిషనర్



నరసరావుపేట: ప్రధాన రహదారులపై ఎటువంటి చెత్త కుప్పలు లేకుండా పర్యవేక్షణ చేయాలని సంబంధిత శానిటరీ ఇనస్పెక్టర్లకు నూతన మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారులు, డంపింగ్ యార్డులను పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెత్త ఒక క్రమ పద్ధతిలో డంపింగ్ చేయాలని సూచించారు. శానిటరీ ఇనస్పెక్టర్ రామకోటయ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పల్స్ పోలియో గోడ ప్రతుల ఆవిష్కరణ

శావల్యాపురం: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఈ నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. 0–5 ఏళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 27 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్ వైజరు అలవలపాటి ఏడుకొండలు, డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు ప్రదానం

చిలకలూరిపేట: జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏఎంజీ హైస్కూల్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్స్ విభాగంలో టి.జాన్ ఫ్రెడ్డీపాల్, బి.ఇందూలక్ష్మి శారద, మొహమ్మద్ ఆతిఫ్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. జూనియర్స్ విభాగంలో ఎం.వర్షిత్‌బాలాజి, బి.అమిత్ డెన్నీ విన్సన్స్, వి.చంద్రిక బహుమతులు సాధించారు. సబ్ జూనియర్స్ విభాగంలో షేక్ తౌసిఫస్ రెహమాన్, పి.అక్షయ్‌కిరణ్, సీహెచ్ మోక్షిత్ తేజ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.లక్ష్మి, రోటరీక్లబ్ ఆఫ్ పండరీపురం అధ్యక్షుడు అంకమ్మచౌదరి, సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ప్రభాకర రెడ్డి, తోటకూర కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ తోటకూర వెంకటనారాయణ, ఏఎంజీ హైస్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణాలకు భూమి పూజ



బొల్లా గిరిబాబుకు స్వాగతం

శావల్యాపురం: వేల్పూరు, పోట్లూరు తదితర గ్రామాల్లో నూతన దేవాలయాల భూమి పూజ కార్యక్రమాలు ఆయా ఆలయ కమిటీల సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. వేల్పూరు గ్రామంలో శ్రీచెన్నకేశ స్వామి దేవాలయం, పోట్లూరులో శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయం భూమి పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి తనయుడు బొల్లా గిరిబాబు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణాకుంభంతో స్వాగతం పలికారు. దేవదయ అధికారులు అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సర్పంచులు రత్నగిరి, జ్యోతి, కమిటీ సభ్యులు వీరాస్వామి, అంకారావు, సొసైటి డైరెక్టరు ఆంజనేయులు, చిన్నా పాల్గొన్నారు.

కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

నరసరావుపేట రూరల్: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి, నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. లిబర్టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ స్కిల్స్‌పై నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన గౌరవ అతిథిగా పాల్గొన్నారు. తను ఐఏఎస్‌పై మక్కువ ఏర్పడిన నాటి నుంచి జిల్లా కలెక్టర్ అయ్యే వరకు జరిగిన ఘటనలను విద్యార్థులకు వివరించారు. 8వ తరగతిలో ఉన్నప్పుడు తమ పాఠశాలకు వచ్చిన కలెక్టర్‌ను చూసి ప్రభావితం అయినట్లు గుర్తుచేసుకున్నారు. చిన్నతనం నుంచి జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన పెంచుకోవడం సివిల్స్ సాధించడంలో కలిసి వచ్చిందని తెలిపారు. మూడవ ప్రయత్నంలో సివిల్స్ పరీక్షలో, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో లిబర్టీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ హరి, అధ్యక్షుడు జయరాజ్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం

- నరసరావుపేట లోకసభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్



పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి: పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం రూ.2.50 కోట్లతో నిర్మించినట్లు నరసరావుపేట లోక్‌సభ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సభలో అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడారు. గత ప్రభుత్వం పేదవాడి వైద్యాన్ని గాలికొదిలేస్తే, జగనన్న ప్రభుత్వం కోట్లాది రూపాయలతో ఆసుపత్రులు అభివృద్ధి చేసి, కార్పొరేట్ వైద్యం అందిస్తోందన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాకు వైద్య ఆరోగ్యశాఖ ఆస్పత్రుల అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు వస్తే.. అందులో రూ.23 కోట్లు పెదకూరపాడు నియోజకవర్గానికే కేటాయించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం మరువలేనిదన్నారు. పెదకూరపాడులో రూ.8.5 కోట్లతో 30 పడకల ఆస్పత్రితోపాటు, అచ్చంపేట ఆస్పత్రికి రూ.2.5 కోట్లు, దొడ్లేరు ఆస్పత్రికి రూ.2.5 కోట్లు, చింతపల్లి ఆస్పత్రికి రూ.2.5 కోట్ల నిధులు కేటాయించి, అభివద్ధి చేసినట్లు చెప్పారు. అయినా.. ప్రతిపక్షాలకు ఇదంతా కనిపించడం లేదన్నారు. నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిలో కనీసం పది శాతమైనా టీడీపీ పాలనలో జరిగిందా అని ప్రశ్నించారు. గ్రామంలో సుమారు రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ హుష్మీ, మాజీ ఎంపీపీ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన సమావేశం



వైద్యాధికారిణి సన్మానిస్తున్న సిబ్బంది

రొంపిచర్ల : మండలంలో వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఈ నెల 3న జరగనున్న పల్స్ పోలియోపై అవగాహన సమావేశం నిర్వహించారు. పాల్గొన్న వైద్యాధికారిణి రేవతిభాయి మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 0–5 సంవత్సరాల లోపు 1831 మంది పిల్లలను గుర్తించినట్లు చెప్పారు. వీరికి నూరు శాతం పోలియో చుక్కలు వేయించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 13 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పల్స్ పోలియో కేంద్రాలలో 52 మంది సిబ్బందిని, ఇద్దరు సూపర్ వైజర్లను నియమించామన్నారు. ఇటీవల పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా ఉత్తమ డాక్టర్‌గా ప్రశంసా పత్రం పొందిన వైద్యాధికారిణి రేవతిభాయిని వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మురళీధర్, ఎంపీహెచ్ ఈఓ సురేష్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించే దిశగా సాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఈఓ కె.వేణుగోపాలరావు తెలిపారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం సీనియర్ ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్ట్ నిపుణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి పాఠశాలలో ప్రీ–ఫైనల్ పరీక్షల మార్కుల ఆధారంగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి సబ్జెక్ట్ నిపుణులతో అత్యుత్తమ మార్కుల సాధనకు శిక్షణ ఇప్పించనున్నట్లు చెప్పారు. మార్చి 2, 3 తేదీల్లో శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఎంపిక చేసి పంపాలని కోరారు.

